రాములోరి కల్యాణానికి వేళాయె..

- రేపు ఆత్మాసీతారాముల కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

శింగనమల: శింగనమలలో అతి పురాతన ఆత్మాసీతారామ స్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించేందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం జరిగితే.. మన రాష్ట్రంలో ఒంటిమిట్ట రామాలయం, శింగనమలలో ఒకే రోజు కల్యాణం జరిపిస్తారు. పూర్వకాలం నుంచి ఈ రెండు దేవాలయాల్లో రాత్రి సమయంలో సీతారాములకు కల్యాణం జరుపుతారు. కాగా.. గత నాలుగు సంవత్సరాలుగా ఎమ్మెల్యే దంపతులు కల్యాణం జరిపిస్తున్నారు.

జనమేజయుడి కాలంలో ప్రతిష్ఠ

శింగనమలలో ఆత్మాసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను పాండవుల వంశస్తులైన జనమేజయుడి కాలంలో ప్రతిష్ఠించారని పెద్దలు చెబుతున్నారు. ఇక్కడ శ్రీరాముడు ఆత్మారాముడిగా వెలిశారు. దీంతో ఈ దేవాలయం ఆత్మారామస్వామిగా దేవాదాయ శాఖ రికార్డుల్లో ఉంది. ఈ దేవాలయం ఎండోమెంట్, పురావస్తు శాఖ పరిధిలో ఉంది.




శింగనమలలోని ఆత్మాసీతారామ లక్ష్మణ విగ్రహాలు, కల్యాణం జరిపించే తలంబ్రాల మండపం ఇదే..

అలాగే ఈ దేవాలయం ముందర సీతారాముల కల్యాణం కోసం 1910లో తలంబ్రాల మండపం నిర్మించారు. ఈ మండపాన్ని 44 రాతి స్తంభాలతో నిర్మించారు.

నవమి నుంచి ఉత్సవాలు ప్రారంభం..

చైత్రశుద్ధ నవమి నుంచి ప్రారంభమై తదియ వరకు ఉత్సవాలు జరుగుతాయి. దేవాలయంలో రోజూ సీతారాములకు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. చతుర్దశి రోజు రాత్రి ఆగమ శాస్త్రం ప్రకారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. పౌర్ణమి రోజు రాత్రి గ్రామంలో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించనున్నారు.

కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

గతంలో గ్రామస్తులు ఏటా కల్యాణం నిర్వహించేవారు. అయితే జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి సొంతంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 5వ తేదీ రాత్రి 7 గంటలకు కల్యాణం ప్రారంభమై రాత్రి 11 గంటల వరకూ జరుగుతుంది. ఆత్మాసీతారాముల కల్యాణంలో భాగంగా స్వామికి ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేయనున్నారు.

బుక్కరాయసముద్రంలో రేపు..

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి-అనంతపురం రహదారి ప్రక్కన వెలసిన వాల్మీకి సీతా రామస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న ఆలయంలో పూజల అనంతరం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు సీతారాములకు కల్యాణం జరిపిస్తారు.

ఆలయానికి విశిష్టత



దక్షిణ భారతదేశంలోనే ఇటువంటి రామాలయం ఎక్కడా లేదు. ఒక్క శింగనమలలోనే ఉంది. శ్రీరాముడు ఆత్మారాముడిగా కొలువుదీరారు. సీతారాముల కల్యాణం రాష్ట్రంలోని ఒంటిమిట్ట రామాలయం, శింగనమలలోనూ ఒకే సారి జరుగుతాయి. కల్యాణం కూడా ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తాం.

– సుబ్బరంగయ్య, అర్చకుడు

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా సంబరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు అందజేస్తారన్నారు.

రేపు బుక్కరాయసముద్రంలో..

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం తాడిపత్రి రహదారి ప్రక్కన విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఈనెల 5వ తేదీన ఆసరా 3వ విడత సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, 6 మండలాల నుంచి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

నేడు సచివాలయాల తనిఖీ

యల్లనూరు: మండలంలోని నిట్టూరు, పెద్దమల్లేపల్లి, చిలమకూరు, యల్లనూరు-1, యల్లనూరు-2, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి సచివాలయాలను మంగళవారం ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తనిఖీ చేయనున్నారు. సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీయనున్నారు. కార్యక్రమానికి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల కన్వీనరు తదితరులు హాజరుకావాలన్నారు.

పథకాల లబ్ధిని వివరించండి

శింగనమల: ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ చేపట్టే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లోలూరు, ఆకులేడు, వెస్ట్ నరసాపురం, శింగనమల, సోదనపల్లి సచివాలయల పరిధిలో పార్టీ సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పథకాల చేకూరిన లబ్ధిని గుర్తు చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం, మన ప్రభుత్వం మధ్య వ్యత్యాసాన్ని వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు అందరం కలిసి కృషి చేద్దామన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, మండల కన్వీనర్ నగేష్, సర్పంచులు నాగమునెమ్మ, వెంకట్రాముడు, వడ్డె సుభాషిణి, భాగ్యమ్మ, బొమ్మన గోపాలురెడ్డి, ఎంపీటీసీ మొరార్జీ, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

పేకాట ఆడుతూ పట్టుబడ్డ టీడీపీ కార్యకర్తలు



టీడీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న రూరల్ పోలీసులు

తాడిపత్రి అర్బన్: కొందరు పచ్చ మూకలు పేకాట ఆడుతూ రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడిన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. రూరల్ అప్‌గ్రేడ్ సీఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాలు.. పట్టణంలోని అంబాభవాని వీధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందింది. ఎస్ఐ గౌస్‌మహ్మద్ బాషా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్తలు రామ్‌నాథ్‌రెడ్డి, ప్రసాద్, ఆంజనేయులు, సతీష్, గోపి, అమర్‌తో పాటు మరో 6 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 మొబైల్ ఫోన్లు, రూ.14,040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: పోతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో సోమవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని త్రివేణి టాకీస్ సమీపంలో వ్యక్తిపై కత్తితో దాడికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని వేణుగోపాల నగర్‌లో నివాసముంటున్న తాడిపత్రికి చెందిన రామాంజినేయులు, అవుకుకు చెందిన సుబ్బారెడ్డి స్నేహితులు. శ్రీరామనవమి పండుగ నాడు త్రివేణి థియేటర్ ఎదురుగా ఉన్న ఓ టీస్టాల్‌లో దారికి అడ్డంగా వీరిద్దరూ కూర్చొని ఉండగా పక్కకు తప్పుకోవాలని భాస్కర్ సూచించాడు. ఆ సమయంలో వారి మధ్య గొడవ చోటు చేసుకుంది. అప్పటి నుంచి భాస్కర్ కోసం రామాంజినేయులు గాలిస్తున్నాడు. ఆదివారం రాత్రి త్రివేని టాకీస్ పక్క వీధిలో కాలినడకన వెళుతున్న భాస్కర్‌ను రామాంజినేయులు, సుబ్బారెడ్డి గుర్తించి, కాయగూరల కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్ వారి బారి నుంచి తప్పించుకుని నేరుగా ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మెరుగైన పాలన అందించడమే లక్ష్యం

గుంతకల్లు: ప్రజల చెంతకే పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ 3న రాష్ట్ర ప్రభుత్వ జిల్లా పునర్విభజనలో భాగంగా గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి గుంతకల్లు, గుత్తి, పామిడి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, పెద్దవడుగూరు మండలాలు కలిపి పరిపాలన కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏడాది పూర్తి అయిన సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిబ్బంది సమాచారంతో పాటు భూముల వివరాలతో కూడిన డైరీని సోమవారం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, ఆర్‌డీఓ రవీంద్ర చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పునర్విభజనలో భాగంగా గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ఏర్పడినట్లు గుర్తు చేశారు. గతంలో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి వ్యవప్రయాసాలు పడి అనంతపురం వెళ్లేవారు అన్నారు. ప్రస్తుతం గుంతకల్లు ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా వెంటనే సమస్య పరిష్కారానికి దోహదపడిందన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్‌డీఓ రవీంద్ర, తహసీల్దార్లు బి.రాము (గుంతకల్లు) మహబుబ్‌బాషా (గుత్తి), సునీత (పామిడి), అలెగ్జాండర్ (యాడికి), ఈరమ్మ (పెద్దవడుగూరు), అనిల్‌కుమార్ (వజ్రకరూర్), బ్రహ్మయ్య (విడపనకల్లు), షాబుద్దీన్ (ఉరవకొండ) తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులివ్వండి



ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. సోమవారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి గ్రామ పంచాయితీలను బలోపేతం చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వైవీఆర్ తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుడు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మంత్రిని కలిసారు. అనంతరం ఎమ్మెల్యే సోదరులిద్దరూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తాడిపత్రి: సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాలన సాగిస్తున్నారని యువ నాయకుడే కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని తాడిపత్రి మండలంతో పాటు యాడికి, తాడిపత్రి పట్టణంలోని 13 మందికి దాదాపు రూ.5.28 లక్షలు విలువ చేసేసీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం లబ్ధిదారుల కుటుంబాల వద్దకు వెళ్లి అందజేశారు. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు చౌడప్ప భార్య మంజుల నాగమ్మ అనారోగ్యంతో చికిత్స చేయించుకుంది. సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మద్దతుదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



పుట్లూరు: పరీక్షకు దివ్యాంగుడైన తన కుమారుడిని ఎత్తుకుని వచ్చిన తల్లి

గుంతకల్లుటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన తెలుగు, సంస్కృతం పరీక్షలకు 2,136 మందికి గానూ 2,125 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి కుళ్లాయప్ప తెలిపారు.

యల్లనూరు/యాడికి: యల్లనూరు జెడ్పీ హైస్కూల్లో తెలుగు పరీక్షకు 200 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరయ్యారు. అలాగే చిలమకూరు ఆదర్శ పాఠశాలలో 156 మందిలో ఒక్కరు మాత్రమే పరీక్షలకు గైర్హాజరయ్యారు. యాడికి మండలంలో పది పరీక్షలకు 795 మందికి గాను 12మంది గైర్హాజరు అయినట్లు మండల విద్యాధికారి కాశెప్ప తెలిపారు.

ప్రత్యేక బస్సు ఏర్పాటు

యల్లనూరు: పది విద్యార్థులు చిలమకూరు ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 15వ తేదీ వరకూ బస్సు విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల అవస్థలను చూసి, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దంపతులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి , గుత్తి మండల వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1772 మంది విద్యార్థులకు గాను 1765 మంది పరీక్షలు రాశారు. 7 మంది గైర్హాజరైయ్యారు. గుత్తిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసింది. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ మాట్లాడుతూ.. పరీక్షలు ముగిసే వరకు మజ్జిగ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గేట్స్ అధ్యాపకులు నాసిర్, జోయెల్ తదితరులు పాల్గొన్నారు.



యల్లనూరు: విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు

గార్లదిన్నె: గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 633 మంది విద్యార్థులుకు గాను 621 మంది పరీక్షలకు హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 127 మందికి 126 మంది విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 219 మందికి 216 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలోని పది కేంద్రాల్లో 2386 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 2359 మంది హజరైనట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 307 మందికి గాను 303 మంది, శ్రీసరస్వతి హైస్కూల్‌లో 168 మందికి గానూ 166 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ రాముడు తెలిపారు.

బుక్కరాయసముద్రం: మండలంలో 722 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వీటిలో 8 మంది గైర్హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పామిడి: మండలంలో మొత్తం 778 మంది విద్యార్థులకు గాను 770 మంది విద్యార్థులకు హాజరైనట్లు ఎంఈఓ జయానాయక్ తలెఇపారు. కేంద్రాల వద్ద సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ చాంద్‌బాషా బందోబస్తు నిర్వహించారు.

రక్తహీనత నివారణకు ప్రభుత్వం కృషి



రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాం బేగంను సన్మానిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గుంతకల్లు రూరల్: ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రుఖియా బేగం పేర్కొన్నారు. మండలంలోని నాగసముద్రం గ్రామంలో సోమవారం సీడీపీఓ నాగమణి అధ్యక్షతన పోషణ పక్వాడా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రుఖియా బేగం మాట్లాడుతూ.. గర్భవతులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపం వల్ల కలిగే రక్తహీనతను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తుందన్నారు. లబ్ధిదారులకు మెరుగైన పోషకాహారం, మంచి ఆరోగ్యం, పరిశుభ్రత, చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టిందని తెలియపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తులసమ్మ, సూపర్‌వైజర్ షాహిదా, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ బాలాజీ, హెల్త్ సీహెచ్‌ఓ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై ఊరేగిన రంగనాథుడు



తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. చైత్ర శుద్ధ ద్వాదశి సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలూరు కోన రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఏటిగడ్డ పాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో త్రివిక్రమ అలంకారంలో శ్రీరాముడు దర్శనమిచ్చారు.

సంక్షిప్త సమాచారం

నైపుణ్య శిక్షణతో ఉపాధికి బాటలు

గుంతకల్లు రూరల్: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు మెరుగుపరచుకుంటేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ పేర్కొన్నారు. సోమవారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు 30 రోజుల పాటు వివిధ విషయాలపై నైపుణ్య శిక్షణ తరగతులను ప్రారంభించారు.

ఇంట్లో చోరీ

తాడిపత్రి అర్బన్: స్థానిక విజయనగర్ కాలనీలోని సుగాలి వీధిలో తాళం వేసిన ఓ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఎస్ఐ ధరణీబాబు తెలిపిన వివరాలు.. సుగాలి వీధికి చెందిన గోవింద్ నాయక్ టైలర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన శ్రీరామనవమి పండుగ సందర్భంగా తమ గ్రామమైన గుత్తి సమీపంలోని బసినేపల్లి తండాకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంట్లో చోరీ జరిగిందని ఇరుగు పొరుగు వారు గోవింద్ నాయక్‌కు సమాచారం ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. 15 తులాల బంగారు, రూ.3 లక్షలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంకుడు గుంతలు తవ్వించాలి

గుత్తి రూరల్: గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు తవ్వించాలని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజునాథ్‌తో కలిసి సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగనన్న కాలనీలలో భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా ఇంకుడు గుంతలు తవ్వించాలన్నారు.

‘మిషన్ వాత్సల్య’కు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్: తల్లి లేదా తండ్రి కోల్పోయి, లేక తల్లిదండ్రులకు దూరమైన అభాగ్య బాల, బాలికలు ఆర్థిక చేయూత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం కోసం ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తాడిపత్రి సీడీపీఓ షాజీదా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ప్రభుత్వాలు అందజేస్తాయన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంతకల్లు రూరల్: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వడ్డే హరి అనే వ్యక్తిని సోమవారం సెబ్ పోలీసులు కసాపురం గ్రామంలో అరెస్ట్ చేశారు. అతడి నుంచి 92 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, రాతన గ్రామానికి చెందిన హరిపై గతంలో కూడా అక్రమ మద్యం కేసులు నమోదైనటు తెలిపారు.

శివాజీకి నివాళి

పామిడి: పట్టణంలో సోమవారం సాయంత్రం భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతిని నిర్వహించారు. భావసార కళ్యాణ మండపం నుంచి శివాజీ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు.

క్లుప్తంగా

రుచికరమైన భోజనం అందించాలి



ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

యల్లనూరు: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా రుచికరమైన ఆహారం వండి పెట్టాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని వాసాపురం, అచ్యుతాపురం, చిలమకూరు, కోడిమూర్తి గ్రామాల్లోని ప్రభుత్వ బడులను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థవంతమైన రీతిలో బోధించాలన్నారు. అలాగే ఆయా పాఠశాలల్లోని ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశమై రోజూ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలన్నారు. నాణ్యత, క్వాంటిటీ లేకపోతే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయులు హాజరుపట్టికలను పరిశీలించారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరులో రెండోస్థానం

యల్లనూరు: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో యల్లనూరుకు జిల్లాలోనే రెండోస్థానం దక్కిందని తహసీల్దార్ రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో కలిపి 796 మంది దరఖాస్తు చేసుకోగా 4 రోజుల్లో 700 మందికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశామన్నారు. అలాగే అనంతపురం డివిజన్‌లోనూ యల్లనూరు మండలం మొదటి స్థానంలో ఉందన్నారు. అలాగే డి డూప్లికేట్ బియ్యం కార్డు కోసం దరఖాస్తులు రాగా వాటిలో 296 మంది స్థానికులే అని విచారణలో తెలిందన్నారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి



గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సమీపంలో సోమవారం కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందింది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం జింక పిల్లకు పంచనామా నిర్వహించారు.

కార్యక్రమాలపై కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలి

గుత్తి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక నుంచి ఏ వార్డులో ఎలాంటి కార్యక్రమం జరిగినా కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. వారితో కలిసి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య , హెల్త్ అసిస్టెంట్ రంజిత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాడిపత్రి టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని సీబీ రోడ్డులో ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ మునివేలు ప్రారంభించారు. గత పన్నెండేళ్లుగా వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వీరారెడ్డి, ఆదినారాయణ స్వామి, కుళ్ళాయిరెడ్డి, హనుమంతరెడ్డి, విశ్వభారతి, కేశవరెడ్డి పుల్లారెడ్డి, వెంకట్రామయ్య, సేతు, ఆశ్వర్థరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నమ్మ తిరునాల



సుడిబండిని లాగుతున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని రావులుడికి గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న చెన్నమ్మ తిరునాల సోమవారం పొంగుపాలు కార్యక్రమంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ముందు భాగంలో పచ్చి కుండలో పాలుపోసి పచ్చి కట్టెలతో మంట మండించి పొంగుపాలు కార్యక్రమం నిర్వహించారు. పాలు ఏ దిక్కుకు పొర్లితే ఆ వైపు నుంచి వర్షాలు వస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ సంవత్సరం పొంగు పాలు నాలుగు దిక్కులకు సమానంగా పొంగాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం సుడిబండిని ఎద్దులతో లాగించారు. తిరునాల సందర్భంగా గాజుల అంగళ్లు, తినుబండారాల దుకాణాలు వెలశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఛెస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.